సచివాలయం.. సుపరిపాలన నిలయం

వెంకటేశ్వరరావుది రాజమండ్రి. తెనాలి దగ్గర్లోని ఇంజినీరింగ్ కాలేజీలో లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూ వచ్చారు. తీరా ఇక్కడకు చేరుకున్నాక ఫైల్లో కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కనిపించలేదు. కానీ, అతను కంగారు పడలేదు. దగ్గరలోని సచివాలయానికి వెళ్లారు. రూ.20లు చెల్లించి కుల ధ్రువీకరణ ప్రింట్ తీసుకున్నారు. అందోళన లేకుండా ఇంటర్వ్యూకు హాజరయ్యారు. రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ పనితీరుకు ఇదో నిదర్శనం.

- ఇంటి ముంగిటకు పాలన
- గంటల వ్యవధిలో ధ్రువీకరణ పత్రాలు
- పథకాల లబ్ధిలో పారదర్శకత
- విస్తృత సేవలతో ప్రజలకు తగ్గిన భారం





తెనాలిలోని చెంచుపేట-1 సచివాలయం

చెంచుపేట-1 సచివాలయం పరిధిలో	
నేరుగా సంక్షేమ లబ్ధి :	రూ.14,19,11,441
నాన్ డీబీటీ మొత్తం :	రూ.10,55,14,681
ఇతర అభివృద్ధి పనులు :	రూ.20,00,000
మొత్తం :	రూ.24,94,26,122

తెనాలి: ప్రజల ముంగిట పరిపాలనకు సచివాలయానికి మించిన ఉదహరణ మరొకటి ఉండదు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం, ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇవ్వడం, సంక్షేమ పథకాలకు అర్హతలను నిర్ణయించడం.. కరెంటు బిల్లు, ఆస్తి పన్ను చెల్లింపు.. ఇలా 550పైగా సేవలకు కేరాఫ్ మారింది సచివాలయం. ప్రతి సేవను ఆన్‌లైన్ చేయడం, అర్హత లేకుంటే దరఖాస్తుదారులకు తెలియజేయటం.. అన్ని వివరాలను ఎస్ఎంఎస్ రూపంలో అర్జీదారునికి తెలియజేయడం ఇక్కడ సిబ్బంది విధుల్లో భాగమే. ప్రతి పథకానికి అర్హుల జాబితా సచివాలయం నోటీసు బోర్డులో ఉంటుంది.

తెనాలిలో ఇలా..

తెనాలి పట్టణంలో మొత్తం 47 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 28వ వార్డులోని 33వ నంబరు సచివాలయం (చెంచుపేట-1)ను పరిశీలిస్తే ఈ వ్యవస్థతో పౌరులకు కలుగుతున్న ప్రయోజనాలు వెల్లడవుతాయి. ఈ సచివాలయం పరిధిలో 4,900 మంది జనాభా ఉన్నారు. అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెస్సింగ్ సెక్రటరీ, రెవెన్యూ సెక్రటరీ, హెల్త్ సెక్రటరీ, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ, ఎమినిటీస్ సెక్రటరీ, శానిటైజేషన్ సెక్రటరీ, మహిళా పోలీస్‌తో సహా తొమ్మిదిమంది ఉద్యోగులున్నారు. పింఛన్ల పంపిణీ, పలు పథకాలకు అర్జీల స్వీకరణ, నమోదు వంటి విధుల నిర్వహణకు 31 మంది వలంటీర్లు ఉన్నారు.

సేవలు భళా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొలుదీరాక 2019 అక్టోబరు 2న అమల్లోకి వచ్చిన సచివాలయ వ్యవస్థలో కేవలం చెంచుపేట-1 సచివాయలం గత జనవరి వరకు 5,357 సేవలను అందించింది. వీటిలో బిల్ పేమెంట్ సరీ్వస్‌లు 1,700 అయితే, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 1,266, కుల ధ్రువీకరణ పత్రాలు 1,217 అందజేశారు. ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్లు 46, వివాహ సర్టిఫికెట్లు 30, ఓబీసీ సర్టిఫికెట్లు 18, సీపీడీసీఎల్ సేవలు 181, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్/అర్బన్ డెవలప్‌మెంట్ సేవలు 162, అడంగల్, ఆర్ఓఆర్‌బీ సర్టిఫికెట్ల కంప్యూటరీకరణ 144 చేశారు. పింఛన్లు 95, లేబర్ లైసెన్సులు 45 వీటిలో ఉన్నాయి. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో అత్యవసరాన్ని దృష్టిలో పెట్టుకుని 24 గంటల్లో రేషను కార్డు మంజూరు చేసిన సందర్భమూ ఉంది. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు అర్జీలిచ్చి, సమస్య పరిష్కారాన్ని కోరవచ్చు.

రూ.14.19కోట్ల సంక్షేమ లబ్ధి..

ఇదే సచివాలయం పరిధిలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.14.19 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. అభివృద్ధి కార్యక్రమాలకు కింద మరో రూ.10.75 కోట్లు వ్యయం చేశారు. అంటే కేవలం ఈ సచివాలయం పరిధిలోనే డీబీటీ, నాన్‌డీబీటీ కలిపి ప్రభుత్వం రూ.24.74 కోట్లను ఖర్చు చేసింది. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పర్యటనలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల ప్రకారం రూ.20 లక్షలతో అభివృద్ధి పనులను పూర్తిచేశారు.

అందుబాటులో సచివాలయం



మాకు సచివాలయం అందుబాటులో ఉండటంతో అన్ని పనులు తేలిగ్గా జరిగిపోతున్నాయి. గతంలోలా ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. జగనన్న చేదోడు కింద నాలుగేళ్ల రూ.10 వేల చొప్పున వచ్చాయి. మా ఇంటావిడకు చేయూత డబ్బులు రెండుసార్లు ఇచ్చారు.

– ఉప్పలపాటి ఏడుకొండలు, సెలూన్ నిర్వాహకుడు

కుల ధ్రువీకరణ ఒక్కరోజులోనే...



నేను ఒంటరి మహిళను. వలంటీరు, సచివాలయం ఉన్నందున నాకెంతో మేలు జరిగింది. కుల ధ్రువీకరణ పత్రం ఒక్క రోజులోనే ఇచ్చారు. సున్నా వడ్డీ రుణం వచ్చింది. ఇంటి స్థలం ఇచ్చారు. అన్నీ వాళ్లే దగ్గరుండి చేసిపెట్టారు. చాలా సంతోషంగా ఉంది.

– గాసా నాగమణి, ఒంటరి మహిళ

చెంచుపేట-1 సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు నేరుగా అందించిన సంక్షేమం

పథకం	లబ్ధిదారులు	అందించిన లబ్ధి (రూ.ల్లో)
1.అమ్మ ఒడి	445	1,89,57,780
2.జగనన్న విద్యా దీవెన	221	92,59,413
3.జగనన్న వసతి దీవెన	188	29,19,754
4.జగనన్న విదేశీ దీవెన	---	---------
5. రైతు భరోసా	375	1,80,16,400
6.పంటల బీమా	143	19,23,514
7. సున్నా వడ్డీ పంటరుణాలు	109	3,38,068
8. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	196	30,87,871
9. మత్స్యకార భరోసా	1	20,000
10. వైఎస్సార్ పెన్షన్ కానుక	437	4,01,49,750
11. వైఎస్సార్ చేయూత	236	1,08,18,750
12. ఆసరా	455	1,18,29,774
13. సున్నా వడ్డీ	705	20,51,981
14. కాపు నేస్తం	16	5,55,000
15.ఈబీసీ నేస్తం	34	8,70,000
16. కళ్యాణమస్తు	1	1,00,000
17. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	164	52,61,966
18. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	97	5,71,625
19. హౌసింగ్ (డీబీటీ)	225	1,21,90,118
20. వైఎస్సార్ బీమా	06	5,90,000
21. వాహనమిత్ర	35	10,10,000
22. నేతన్న నేస్తం	1	96,000
23.చేదోడు	15	3,00,000
24. కోవిడ్ సాయం	968	9,68,000
25. జగనన్న తోడు (వడ్డీ)	57	25,677
మొత్తం:	5,130	రూ.14,19,11,441
నాన్ డీబీటీ లబ్ధి ఇలా..		
26. ఇళ్ల స్థలాలు	284	6,98,64,000
27. విద్యాకానుక	177	12,57,054
28. ట్యాబ్‌లు	34	4,49,548
29. జగనన్న తోడు (రుణాలు)	248	46,17,512
30. గోరుముద్ద	185	18,32,795
31. వైఎస్సార్ సంపూర్ణ పోషణ	234	43,82,820
32. రైస్ కార్డులు	1,058	2,31,10,952
33. కంటివెలుగు	--	-------
మొత్తం:	2,220	రూ.10,55,14,681

వయోజనులకు బీసీజీ టీకాలను వేయండి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: వయోజనులందరికి బీసీజీ టీకాలు వేయాలని తెనాలి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఇ.అన్నపూర్ణ ఆదేశించారు. తెనాలి పరిధిలోని మెడికల్ ఆఫీసర్లతో టీబీ యూనిట్‌లో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ బీసీజీ టీకా వేయించుకునేందుకు అర్హులన్నారు. ప్రభుత్వం మొదటి విడత కింద వృద్ధులకు వేయడం జరుగుతుందన్నారు. రెండో విడత అందరికి టీకాను వేయనున్నట్లు చెప్పారు. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ కలగొట్ల రాధిక మాట్లాడుతూ అర్హులు తమ పేర్లను సచివాలయంలో నమోదు చేయించుకోవాలని చెప్పారు. క్రమపద్ధతిలో అందరికి టీకాలు వేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో తెనాలి పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

పార్కుల మరమ్మతులు వెంటనే చేపట్టండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: మున్సిపల్ పార్కుల్లో అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. 8వ వార్డులోని గాంధీ పార్కును మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన మరమ్మతులపై డీఈ నాగభూషణం నుంచి వివరాలు సేకరించారు. అనంతరం 10వ వార్డులో పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంచి నీటి సరఫరా సక్రమంగా చేయాలన్నారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాజీ, రామచంద్రరావు, హార్టి కల్చర్ ఆఫీసర్ శేషుబాబు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



స్ప్రేయింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

సీనియర్ పాత్రికేయుడు ఆర్ఎన్ గోపాలకృష్ణ మృతి

నేడు పెనుగుదురు పాడులో అంత్యక్రియలు



ఆర్ఎన్ గోపాలకృష్ణ

తెనాలి: ఆర్ఎన్ గోపాలకృష్ణగా చిరపరిచితులైన, పట్టణంలోని సీనియర్ పాత్రికేయుడు, ఆర్చక సంఘ రాష్ట్ర నేత రొంపిచర్ల నాగ గోపాలకృష్ణమాచార్యులు (75) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. అనారోగ్యానికి లోనైన ఆయన తిరుపతిలో కుమార్తె ఇంట్లో ఉంటూ అక్కడే చికిత్స తీసుకుంటున్నారు. ఆయనకు భార్య, అయిదుగురు కుమార్తెలు, మనుమ సంతానం ఉన్నారు. భాషా ప్రవీణ చదివిన గోపాలకృష్ణ ముందుగా పాత్రికేయ రంగంలోకి వెళ్లారు. రేపల్లె, తెనాలిలో ప్రముఖ పత్రికలకు విలేకరిగా దాదాపు పదేళ్లకు పైగా పనిచేశారు. విజయవాడ నుంచి వెలువడిన ఇంగ్లిష్ దినపత్రిక ప్లెడ్జికు కొంతకాలం విలేకరిగా ఉన్నారు. జర్నలిస్టు, సినీ నటుడు ఏవీఎస్‌తో కొంతకాలం కలిసి పనిచేశారు. ఏవీఎస్‌తో కలిసి రసమయి సాంస్కృతిక సంస్థను ఏర్పాటుచేసి స్థానిక రాజకీయ నేత డాక్టర్ రావి రవీంద్రనాథ్‌తో కలిసి పలు కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర అర్చక సంఘంలోనూ క్రియాశీలంగా ఉంటూ అర్చక సమస్యల పరిష్కారంలో తన వంతు కృషిచేశారు. తెనాలి రామలింగేశ్వరపేటలోని ప్రాథమిక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా చేరారు. ఉద్యోగం నుంచి రిటైరయ్యాక చుండూరు మండల గ్రామం పెనుగుదురుపాడు లోని శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం అర్చకుడిగా విధులు నిర్వహించసాగారు. అక్కడే ఇల్లు ఏర్పాటుచేసుకున్నారు. గోపాలకృష్ణ భౌతిక కాయాన్ని తిరుపతి నుంచి పెనుగుదురుపాడు తరలించనున్నారు. బుధవారం ఆ గ్రామంలోనే అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలు

1 నుంచి నక్షత్ర లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణ

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో నక్షత్ర లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం, వార్షిక శ్రీహనుమజ్జయంతి మహోత్సవాలు జూన్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీహనుమత్ సేవా సమితి, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగే వేడుకల ఆహ్వాన పత్రికను మంగళవారం ఆలయంలో ఆవిష్కరించారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, వైఖానస పండితులు వేదాంతం నాగ మారుతి, ఏజీఎల్. రఘురామ్ సన్నాహక వైదిక క్రతువును ఆగమోక్తంగా జరిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త ములుకుట్ల విశ్వనాథశర్మ హనుమాన్ చాలీసా పారాయణ విశిష్టతను వివరించారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తొలిసారిగా నక్షత్ర లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణను నిర్వహించటం సంతోషకరంగా ఉందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్చకులు మాట్లాడుతూ నక్షత్రానికి లక్ష చొప్పున 27 నక్షత్రాలకు 27 లక్షల సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణానికి సంకల్పించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ చేపట్టిన బృహత్తర ఆధ్యాత్మిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పారాయణ పూర్తి చేసిన అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వివరించారు. భక్తులు తమ జన్మ నక్షత్రం లేక నామ నక్షత్రంతోనైనా పారాయణంలో పాల్గొనవచ్చని తెలిపారు. అనంతరం సంకీర్తన సభ్యులు, భక్తులు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ వ్యవస్థాపకు కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ , కౌన్సిలర్లు పసుపులేటి త్రిమూర్తి, దేసు యుగంధర్, సంకీర్తన బందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సేవాసమితి అధ్యక్షులు ఆర్.వి. కిరణ్‌కుమార్, సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, రొంపిచర్ల సురేష్, గుడివాడ బాలకష్ణ, కె.రమణ కుమార్, ఎం.చంద్రశేఖర్, బి .లీలా ప్రసాద్, పి.మురళిమనోహర్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

నేటి నుంచి క్రికెట్ లీగ్ పోటీలు

తెనాలి: కేబీఎస్ అండ్ కేవీఆర్ క్రికెట్ లీగ్ పోటీలు బుధవారం నుంచి తెనాలిలో ప్రారంభం కానున్నాయి. స్థానిక వీఎస్సార్ అండ్ ఎవీఆర్ కాలేజీలో జరిగే పోటీల వివరాలను నిర్వాహకులు మంగళవారం ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజి ఆవరణలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేబీఎస్ అండ్ కైవైఆర్ క్రికెట్ లీగ్ గత ఎనిమిదేళ్లగా తమ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. జూన్ 6వ తేదీ వరకు జరిగే ఈ క్రికెట్ లీగ్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ కావేటి యలమందరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేబీఎస్ – కేవైఆర్ క్రికెట్ లీగ్‌ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. తెనాలి పట్టణ కృష్ణ బలిజ సంఘ అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్ పర్యవేక్షణలో విజయవంతం చేయనున్నట్లు చెప్పారు. కృష్ణ బలిజ సంఘ పెద్దలు కావేటి విజయ భాస్కర్, కావేటి సాంబయ్య, కావేటి శ్రీనివాసరావు, రామారావు, నిర్వాహకులు సురేష్, శివరాం, వేణు, గోపి, శ్రావణ్, వెంకటేష్, కోటేష్, కమిటీ సభ్యులు కిరణ్ బాబు, సతీష్, ప్రదీప్, ప్రేమ్, సాయి బాబు, మోహన్ సాయి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న కమిటీ సభ్యులు

1న హనుమజ్జయంతి వేడుకలు

తాడేపల్లి రూరల్ : కొత్తూరు తాడేపల్లి, మారుతీ నగర్ శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానంలో జూన్ 1న హనుమజ్జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటలో తెలియజేశారు. మే 30 గురువారం మూల విరాట్‌కు పంచామృత అభిషేకం, శుక్రవారం ఉదయం మన్యుసూక్త సహిత హనుమత్ హోమం, సాయంత్రం సువర్చల సహిత దాసాంజనేయస్వామి కల్యాణ మహోత్సవం 1న దాసాంజనేయస్వామికి ఉదయం తమలపాకుల పూజ, సిందూరార్చన, విశేష అర్చనలు, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నామని తెలిపారు.

పవర్ లిఫ్టర్‌కు ఫీజు రాయితీ

తాడేపల్లి రూరల్ : పవర్ లిఫ్టింగ్‌లో వరుసగా నాలుగు బంగారు పతకాలు సాధించిన విద్యార్థినికి వందశాతం ఫీజు రాయితీ ఇస్తున్నట్లు కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ తెలిపారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ జూనియర్ విభాగంలో (84 కేజీలు) కేఎల్‌యూ విద్యార్థిని షేక్ షబీనా స్కాట్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ విభాగాలతో పాటు మొత్తం నాలుగు బంగారు పతకాలు సాధించి, రికార్డు సృష్టించిందని తెలిపారు.



షేక్ షబీనాను అభినందిస్తున్న వీసీ డాక్టర్ పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు

క్లుప్తంగా

నేడు జాబ్ మేళా



తెనాలి అర్బన్: ఇంటర్మీడియెట్ బోర్డు, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10గంటలకు రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు హెచ్‌సీఎల్ కంపెనీ కో-ఆర్డినేటర్ పి.గురునాథ్ పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్‌లో 75శాతం మార్కులు దాటిన బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సు పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. మూడంచెల విధానంలో ఎంపిక ఉంటుందని, ఎంపికై న వారికి ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చి అనంతరం హెచ్‌సీఎల్ ఉద్యోగిగా నియమించడం జరుగుతుందన్నారు. ట్రైనింగ్ సమయంలో నెలకు రూ.10 వేలు, ఉద్యోగంలో చేరిన నాటికి నుంచి నెలకు రూ.14,500 ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రముఖ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ కూడా చదివేందుకు సంస్థ ఆర్థిక సాయం చేస్తుందని చెప్పారు. వివరాలకు గురునాథ్ మొబైల్ నంబరు 77807 54278కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి జూనియర్ కళాశాల డైరెక్టర్ పాటిబండ్ల శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

1న హనుమాన్ శోభాయాత్ర

వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్



తెనాలి: హనుమజ్జయంతి సందర్భంగా జూన్ 1న తెనాలిలో హనుమ శోభా యాత్ర బైక్ ర్యాలీని ఘనంగా చేపట్టనున్నారు. సంబంధిత స్టిక్కర్లు, వాల్ పోస్టర్లను తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మంగళవారం ఆవిష్కరించారు. శోభా యాత్ర కమిటీ సభ్యులు స్థానిక అయితానగర్‌లోని నివాసంలో శివకుమార్‌ను కలిశారు. సుల్తానాబాద్‌లోని హనుమాన్ ఆలయం నుంచి యాత్ర ఆరంభించి, దేవి చౌక్‌లోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కమిటీ సభ్యులు, హనుమాన్ భక్తులు వేమా సురేష్‌బాబు, కొల్లా గురునాథ్ గుప్త, మద్దాళి శేషాచలం, భాస్కరుని శ్రీనివాసరావు, కనమర్లపూడి సుబ్రహ్మణ్యం, ఆవుల కోటయ్య, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, పూర్ణచంద్రరావు, ఫణి, హనుమారెడ్డి, రమణ, అశోక్‌యాదవ్, సత్యం, ఆదిత్య, శ్రీను, బ్రహ్మం, కిరణ్, వాసు, కృష్ణ పాల్గొన్నారు.

హనుమయ్యకు సిందూరార్చన



తెనాలిరూరల్: పట్టణ మారీసుపేటలోని శ్రీ బాల త్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్ర మౌళీశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న హనుజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అంజనేయునికి సిందూరార్చన చేశారు. ఆలయ ఆవరణలోని దక్షిణ ముఖ ఆంజనేయుని విగ్రహం వద్ద పూజాది క్రతువులను జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కోశాధికారి వెంకటశేషగిరిరావు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు



తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అలజడలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ జి. దశరథరామారావు హెచ్చరించారు. పోలీసు శాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యల్లో భాగంగా వన్ టౌన్ సర్కిల్ పరిధిలోని గురవయ్య కాలనీలో సీఐ తన సిబ్బందితో కలసి మంగళవారం రాత్రి పర్యటించారు. స్థానికులతో మాట్లాడుతూ ఏవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: పట్టణంలోని భార్గవ పేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భార్గవపేటకు చైతన్య అనే యువకుడు రోజు లాగే తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి మంగళవారం ఉదయం లేచి చూడగా కనిపించ లేదు. చోరీకి గురయిందని గ్రహించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

తెనాలి: ఎన్టీఆర్ శతజయంతి మహోత్సవ కమిటీ, తెనాలి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం విశ్వ విఖ్యాత నటసార్వ భౌమ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల ముగింపు వేడుకను నిర్వహించారు. స్థానిక ఎస్‌వీఆర్ కన్వెన్షన్ సెంటరులో ఏర్పాటు చేసిన సభకు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. జనసేన పీఏసీ చైర్మన్, ఆ పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి నాదెండ్ల మనోహర్, నన్నపనేని రాజకుమారితో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి బ్రోచర్ ఆవిష్కరించారు. ఏపీని డాక్టర్ డి.శారద విడుదల చేశారు. సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ప్రారంభోపన్యాసం చేశారు. నన్నపనేని సుధాకర్, గిరిధర్‌గౌడ్ రాయన, చెరుకుమల్లి సింగారావు, సోమవరపు నాగేశ్వరరావు, షేక్ జానిబాషా, మహమ్మద్ షాబిర్, అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా పద్మావతి అమ్మవారి కల్యాణం



తెనాలిరూరల్: మండలంలోని ప్రగడ కోటయ్య నగర్‌లో జరుగుతున్న అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం అభిషేకం నిర్వహించారు. అనంతరం 11 గంటలకు పద్మావతి అమ్మవారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు కటకం రాంబాబు, అన్నపూర్ణ దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొనగా.. ఆలయ అర్చకుడు కొండపి వెంకటదత్త శర్మ కల్యాణ క్రతువులు జరిపించారు. కొండపి శ్రీనివాసరావు, వసుంధర దంపతులు, అందే బాల చంద్రమౌళి, రాజేశ్వరి దంపతులు, వంగర కోటేశ్వరమ్మ, సుజాత, ఇంకా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పద్మావతి అమ్మవారి కల్యాణాన్ని తిలకించారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



సాయికుమార్ రెడ్డి

తెనాలిరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ శాలిపేటకు చెందిన 20 ఏళ్ల దొడ్డ సాయి కుమార్ రెడ్డి ఫిట్స్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నెల 27న బోస్ రోడ్డులోని సాయిబాబా గుడి వద్దకు వచ్చిన అతను తిరిగి ఇంటికి వెళ్లలేదు. యువకుడి తల్లి మంగళవారం పోలీసులను ఆశ్రయించగా వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

87 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మునగపాడు గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 87 మందికి రక్త, మూత్ర పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యానీగ్రేస్ ఆరోగ్య జాగ్రత్తలను రోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ కె.సుదర్శన్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీ లింగరాజు, ఏఎన్ఎం పాపులమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతిరాత నైపుణ్యంతో జీవితంలో ప్రగతి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాత నైపుణ్యంతో చదువులో ప్రతిభ చాటడంతో పాటు జీవితంలో ప్రగతి సాధించవచ్చునని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. క్యాలీగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో స్థంభాల గరువులోని చేబ్రోలు మహాలక్ష్మి- పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు నిర్వహిస్తున్న చేతిరాత శిక్షణ తరగతులను ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పొత్తూరు జెడ్పీ హైస్కూల్ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఉప్పాల రామమోహనరావు సారథ్యంలోని శిక్షణ తరగతులకు హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకోవడం ద్వారా విద్యార్థులు చదువులో ప్రతిభ చూపగలరని తెలిపారు. చేతిరాతను మెరుగుపరచుకోవడం ద్వారా మానసికంగాను మార్పులు సంభవిస్తాయని, చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులందరు ఒక బృందంగా ఏర్పడి, చేతిరాత నైపుణ్యంపై తోటి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉప్పాల రామమోహనరావు మాట్లాడుతూ బుధవారం ముగియనున్న మూడు రోజుల శిక్షణ తరగతులకు 38 మంది ఉపాధ్యాయులతో పాటు 57 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. శిక్షణ తరగతుల్లో క్యాలీగ్రఫీ రీసోర్స్ పర్సన్లు తొరటి శ్రీనివాసరావు, బురాన్, ప్రసాద్, నాగమణి, శారద, నాగలక్ష్మి, రమాదేవి, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.